క్లుప్తంగా

ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే



ఏలేశ్వరంలో ఇంటింటికీ సర్వే చేస్తున్న అధికారుల బృందం

ఏలేశ్వరం: భవిత కేంద్రంలో చేర్పించేందుకు ప్రత్యేక అవసరాలు గల పిల్లల సర్వేను పట్టణంలో శనివారం నిర్వహించారు. ఎంఈఓ వరలక్ష్మీ, భవిత కేంద్రం టీచర్లు వాణి పద్మజ, బుజ్జి, ఎంపీపీ టౌన్ స్కూల్ హెచ్.ఎం కాశీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులను పురస్కరించుకుని ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వివరాలను నమోదు చేశామన్నారు. వీరిని విద్యా సంవత్సరం ప్రారంభంలోని భవిత కేంద్రాల్లో చేర్పించి విద్య అందిస్తామన్నారు. పిల్లలకు చదువుతో పాటు పలు అంశాలపై శిక్షణ, ఫిజియోథెరపీలో శిక్షణ అందిస్తామన్నారు.

పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు



నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహంను సన్మానిస్తున్న గోకవరం పార్టీ నాయకులు

గోకవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జాయింట్ సెక్రటరీగా గోకవరంకు చెందిన అక్షింతల రాజాను ఎంపికచేయడంతో శనివారం గోకవరం వచ్చిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహంను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయనకు దుశ్శాలువా కప్పి పూలమాలలువేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామంలో పీహెచ్‌సీ ఏర్పాటు



నిర్మాణపనులు పరిశీలిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరం గ్రామంలోని తాత్కలిక పీహెచ్‌సీ ఏర్పాటుకై నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనానికి హంగులు అద్దుతున్నారు. శనివారం ఈ నిర్మాణ పనులను ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ సూచించారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీకి సొంత భవనం లేకపోవడంతో నిరుపయోగం ఉన్న ప్రభుత్వ భవనానికి మండల నిధులతో మరమ్మతులు చేపట్టామన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేసి ఆసుపత్రిగా మారుస్తున్నామన్నారు. కార్యక్రమంలో అల్కరాజు, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణా శిబిరం

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణా శిబిరాన్ని జూన్ 7 వరకు నిర్వహిస్తున్నట్టు కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ పి ప్రవీణ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పాఠశాలలు, కళాశాలలు నుంచి క్యాండెట్లు ప్రాంతీయ, సాంస్కృతిక సరిహద్దులను దాటి కలిసి వచ్చే వేదిక అని, మనదేశ ఐక్యత, వైవిధ్యాన్ని సూచిస్తుందని, జాతీయ సమైక్యత స్ఫూర్తిని బలపరుస్తుందన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



అచ్చంపేటలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఇన్‌చార్జి గిరిబాబు, సియర్ నాయకులు యనమల కృష్ణుడు

శంఖవరం: మండలంలోని అచ్చంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారి విగ్రహప్రతిష్ఠ ఆలయ కమిటీ శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. స్థానిక భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు.

ప్రత్తిపాడు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు, పార్టీ సీనియర్ నాయకులు యనమల కృష్ణుడు కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ నియోజక పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు కనకదుర్గ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్ని ఆలయ కమిటీకి రూ. 10 వేలు విరాళం అందజేశారు.

తప్పుడు హామీలతో వంచన

జగ్గంపేట: రాష్ట్రంలో తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ప్రజలను వెన్నుపోటు పొడిచిందని, దీనికి నిరశనగా జూన్ 4వ తేదిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు నిర్వహించే వెన్నుపోటు దినాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రజలు విజయవంతం చేయాలని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. జగ్గంపేట పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలోని ఆయన వెన్నుపోటు దినం పోస్టర్ విడుదల చేసిన అనంతరం కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేసిందో వివరించారు. నలభై సంవత్సరాల ఇండస్ట్రీ అని చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు కేవలం అధికారంలోకి రావడం కోసమే అమలు సాధ్యం కాని హామిలు ఇచ్చి తరువాత అమలు చేయలేమంటూ చేతులు ఎత్తివేయడం విడ్డూరమన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన హామీ ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుందా లేదా తెలియదా అని ప్రశ్నించారు. విశాఖపట్టణంలో ఎంతో విలువైన భూములను ఎకరం 95 పైసలకు ఇవ్వడాన్ని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయకుండా ఎలా దాటవేస్తోందో ప్రజలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నేతలు, రామకుర్తి జగాల్, జిల్లా నేతలు శ్రీనివాస్, రాజబాబు, వీర్రాజు, మండల నేతలు రావుల గణేష్‌రాజా, వెంకటరమణ, రాము ,వివిధ మండలాలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

నమ్మించి నట్టేట ముంచారు

గోకవరం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం పిలుపునిచ్చారు. శనివారం గోకవరంలో ఎస్వీర్ ఫంక్షన్ హాల్ నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, మోసపూరితమైన హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి నట్టేట ముంచారని అందుకు నిరసనగా జూన్ 4న చేయతలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. అనంతరం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుంకర వీరబాబు, గులా ఏడుకొండలు, సుంకర రమణ, అక్షింతల రాజా, మడికి మైనర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వెన్నుపోటు

తొండంగి: ఎన్నికల్లో సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రజలకు అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి పార్టీల తీరును నిరసిస్తూ జూన్ నాలుగున చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైస్.ఎంపీపీ నాగం గంగబాబు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు శనివారం శృంగవృక్షంలో పార్టీ నాయకులతో కలిసి వెన్నుపోటు దినం ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టి, వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర బూత్ కమిటీల జనరల్ సెక్రటరీ బెక్కం చంద్రగిరి, సాపిశెట్టి మాణిక్యాలరావు, నియోజకవర్గ మహిళా విభాగం ప్రెసిడెంట్ సుశీలారాణి, యూత్ ప్రెసిడెంట్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై నిరసన

కోటనందూరు: ఈ నెల 4న నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వెన్నుపోటు దినం ప్రచార పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు కూటమి సూపర్ సిక్స్ హామీలతో ప్రజలకు వెన్నుపోటు పొడించిందని పెద్ద ఎత్తున తరలివచ్చి చంద్రబాబు మోసాలు, అరాచకాలపై నిరసనగళం విప్పాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొర్లి రామచంద్రరావు, వెలగ కష్టాజి, చింతకాయల చినబాబు,వేముల రాజ బాబు, లంక ప్రసాద్ పాల్గొన్నారు.

తుని రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జూన్ నాలుగో తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమం పోస్టర్‌ను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. శనివారం ఎస్.అన్నవరంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం ఆవరణలో తుని మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేంద్ర నెహ్రూ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి, చేసిన మోసాలను అరాచకాలు, అన్యాయంపై జరిగే నిరసన కార్యక్రమం వెన్నుపోటు దినంలో నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొనాలన్నారు. నాలుగో తేదీ వరకు ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబు చేసిన మోసాలను, అరాచకాలను, అన్యాలయాలను వివరించాలన్నారు. ప్రజలను వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాలుగో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు తునిలో ఆంజనేయస్వామి గుడి దగ్గర నుంచి మెయిన్ రోడ్డు, అల్లూరి సీతారామరాజు సెంటర్, రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ నిరంకుశ పాలనను ప్రజలకు తెలియచేద్దామన్నారు. నాయకులు కుర్ర బాబ్జి, చిటికెల వరహాలబాబు, వంగలపూడి కాంతరావు, పాకలపాటి రవిరాజు, రెడ్డి దత్తుడు, జక్కాన రామ చంద్రరావు, పార్టీ అనుబంధ కమిటీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగ్గంపేటలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను విడుదల చేసస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం



ఎస్.అన్నవరం పార్టీ కార్యలయంలో వెన్నుపోటు దినం నిరసన పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



కోటనందూరులో ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాస్



గోకవరంలో వెన్నుపోటు దినం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తోట

సమష్టిగా పనిచేయాలి

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సూచించారు. పట్టణంలో శనివారం పలు కార్యక్రమాల్లో పాల్గొని నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామిలను గాలికి వదిలేశారన్నారు. పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నేతలు సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, కోరాడప్రసాద్, శిడగం వెంకటేశ్వరరావు, పైల విజయ్‌కుమార్, జువ్వన వీర్రాజు, వాగు బలరామ్, తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో పార్టీ శ్రేణులతో కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ముద్రగడ

ఉపాధ్యాయుల బదిలీలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యయులు భారీగా బదిలీలయ్యారు. ఈ మేరకు శనివారం ఎంఈఓ బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఆరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెరసి 11 మంది ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులలో ఒమ్మంగి నుంచి బి. వెంకన్న సీతానగరం మండలం కె కూనవరానికి, చింతలూరు నుంచి ఎంవీఆర్ రామారావు గొల్లప్రోలు మండలం మల్లవరానికి, గజ్జనపూడి నుంచి బి.శ్రీనివాసరావు కాకినాడ రూరల్ మండలానికి, చినశంకర్లపూడి నుంచి సీహెచ్ రాజేశ్వరి ఏలేశ్వరం బాలికల హైస్కూల్‌కు, ప్రత్తిపాడు నుంచి టీవీవీ సత్యనారాయణ రెడ్డి అనపర్తికి బదిలీ అయ్యారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల విషయానికొస్తే..లంపకలోవ, రాచపల్లి, ఒమ్మంగి 2, ఏలూరు, హెచ్‌ఎంలు అదే మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, ధర్మవరం గ్రామాల్లోని పాఠశాలలకు, ఒకరు రాజమహేంద్రవరం, మరోకరు అమలాపురం ప్రాథమిక పాఠశాలలకు బదిలీ అయ్యారు. కాగా వీరి స్థానంలో ఆరుగురు గెజిటెడ ప్రధానోపాధ్యాయులు బదిలీపై ప్రత్తిపాడు మండలానికి వచ్చారని ఎంఈఓ వి.రాజ బాబు వెల్లడించారు.

14 అంశాలు ఆమోదం

తుని: పురపాలక సంఘం పరిధిలోని పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అధ్యక్షతన జరిగింది. అజెండాలో పొందు పరిచిన 15 అంశాల్లో 14 అంశాలను ఆమోదించి, ఒక అంశాన్ని వాయిదా వేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి మాట్లాడుతూ బ్యాంక్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉన్న స్థలంలో అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి చేసిన ప్రతిపాదనను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. వైద్య ఆరోగ్యశాఖ భవన నిర్మాణానికి రూ.80 లక్షలు నిధులు మంజూరు చేశారని చెప్పారు. బీపీఎస్, ఎల్.ఆర్.ఎస్ నిధులు రూ.3 కోట్లతో వార్డుల్లో చేపట్టనున్న మౌలిక సదుపాయాల కల్పనకు ఆమోదం తెలిపారు. రామకృష్ణా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సు, జనరల్ మార్కెట్‌లో దుకాణాల గడువు ముగియడంతో అద్దె పెంచి మూడేళ్ల పాటు రెన్యువల్ చేసేందుకు అనుమతిని మంజూరు చేశారు. వీరవరపుపేటలో సర్వే నంబర్ 234లో ఉన్న ఖాళీ స్థలాన్ని రద్దు చేయాలని కమిషనర్ వెంకట్రావు చేసిన ప్రతిపాదనను కౌన్సిలర్లు ఆమోదం తెలపలేదు. ప్రస్తుత భూమి కోర్టు పరిధిలో ఉన్నందున క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు కుచ్చర్లపాటి రూపాదేవి, ఆచంట సురేష్, పలువురు కౌన్సిలర్లు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

తోట రాంజీకి కీలక పదవి

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీగా నియిమితులైన మాజీ మంత్రి తోట నరసింహం తనయుడు యువనేత తోట రాంజీని జగ్గంపేట పార్టీ కార్యలయంలో నేతలు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. శనివారం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు, అభిమానులు పూలమాలలు, దుశ్శాలువాలతోనూ రాంజీని సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం రాంజీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టిన మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్‌రెడ్డి నమ్మకానికి అనుగుణంగా పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.



జగ్గంపేట పార్టీ కార్యాలయంలో తోట రాంజీకి కేక్ తినిపిస్తున్న తోట నరసింహం

ఆటో, లారీని ఢీకొట్టిన కారు



ప్రత్తిపాడు జాతీయ రహదారిపై లారీ, ఆటోను ఢీకొన్న కారు

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు..హైదరాబాద్‌లోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన నలుగురు యువకులు చిన్నారెడ్డి, సుశాంత్, అశ్విత్, నితిన్‌లు శనివారం విజయనగరానికి కారులో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు ప్రత్తిపాడు సమీపానికొచ్చే సరికి ముందు వెళ్తున్న ఆటోను ఢీకొని, రోడ్డు పక్కనే నిలిచి ఉన్న ట్యాంకర్ వెనుక భాగాన ఢీకొంది. ఈ ఘటనలో కారును నడుపుతున్న చిన్నారెడ్డి, పక్క సీటులో ఉన్న సుశాంత్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వెనక సీటులో ఉన్న అశ్విత్, నితిన్‌లకు ప్రమాదం నుంచి బయటపడ్డారు. గాయపడిన చిన్నారెడ్డి, సుశాంత్‌లను స్థానిక కమ్యూనిటి హెల్త్ సెంటర్‌కు తరలించారు. వీరంతా 21, 22 ఏళ్ళ యువకులే గమనార్హం. ప్రాథమిక చికిత్స అనంతరం క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దీక్ష విరమణ

శంఖవరం: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో న్యాయం చేయాలంటూ ఐదు రోజులుగా నిరహార దీక్ష చేస్తున్న అంగన్వాడీ కార్యకర్త ఎం.పద్మకు న్యాయం చేస్తామని ఐసీడీఎస్ పీఓ.కె. విజయకుమారి అన్నారు. శనివారం పీఓ దీక్షా శిబిరానికి వెళ్లి ఆమెకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ రౌతులపూడి మండలం రామకృష్ణాపురంలో ఎం.పద్మ 12 ఏళ్ల క్రితం (కండిషనల్ ఆర్డర్‌పై) అంగన్వాడీ కార్యకర్తగా విధుల్లో చేరిందన్నారు. రోస్టర్లో భాగంగా హైకోర్టు ఆదేశం ప్రకారం బీసీ.డీకి చెందిన పాసిల భవానీ పద్మ స్థానంలో అంగన్వాడీ కార్యకర్తగా చేరిందన్నారు. దీంతో ఎం.పద్మకు మరో 12 ఏళ్లు సర్వీసు ఉన్నందున కలెక్టర్ ఆదేశాల మేరకు రౌతులపూడి మండలం సార్లంక మిని అంగన్వాడీ కార్యకర్తగా ఆమెకు ఉద్యోగం కల్పిస్తున్నామన్నారు.



పద్మకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేస్తున్న ఐసీడీఎస్ పీఓ విజయకుమారి

మాజీ వైస్ ఎంపీపీని పరామర్శించిన మురళీకృష్ణం రాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడి వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ అల్లు సత్యనారాయణను ఆ పార్టీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణం రాజు శనివారం పరామర్శించారు. సత్యనారాయణ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఆయన్ని మురళీరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీటీసీ మొల్లి వీరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నూకరాజు, కోలా తాతబాబు, నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

ఉపాధి కూలీల తిప్పలు

తుని రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల బకాయిలు చెల్లించాలని సీఐటీయూ కార్మిక సంఘం నాయకుడు నక్కెళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఎంపీడీఓ కె.సాయినవీన్, ఏపీఓ పసుపులేటి నారాయణ రావులను వేర్వేరుగా కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసలు నివారించి గ్రామీణ వ్యవసాయ కూలీలకు పనులు కల్పిస్తామన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బకాయిలు చెల్లించకుండ వేధిస్తుందన్నారు. ఎనిమిది వారాలుగా కూలి డబ్బులు అందకపోవడంతో కూలీలు పస్తులు ఉండాల్సి వస్తుందన్నారు. ఇతర పనులు లేక ఉపాధి పనులకు వెళ్లాల్సి వస్తుందని, ప్రభుత్వాలు కూలి డబ్బులు చెల్లించక కూలీలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. పని ప్రదేశంలో కనీస సదుపాయాలు కల్పించడంలేదని, పనులు చేసేందుకు పలుగు పార, పే స్లిప్పులను అందించడం లేదన్నారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ, ఏపీఓలను కోరామన్నారు.



తుని ఎంపీడీఓ సాయినవీన్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘం నాయకుడు శ్రీనివాస్

రిటైర్ ఉపాధ్యాయుడికి సత్కారం

జగ్గంపేట: మండలంలోని పలు గ్రామాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ప్రజల మన్ననలు అందుకుని ఏలేశ్వరం మండలంలో పనిచేస్తూ రిటైర్ అయిన ఉపాధ్యాయడు పసగొడుగుల బాబురావును శనివారం జగ్గంపేట మండలం మామిడాడలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు.మామిడాడ గ్రామానికి చెందిన బాబురావు జగ్గంపేట మండలం, భావవరం,కాండ్రేగుల, ఇర్రిపాక ,గ్రామాల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసే గత 30 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఆయన వద్ద చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలలోను, రాజకీయాల్లో మంచి పదవులలోనూ కొనసాగుతున్నారు. ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామంలో నేడు పనిచేస్తు పదవీ విరమణ చేశారు. ఆయన వద్ద విద్య నేర్చుకున్న పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి సేవలను కొనియాడారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసి బాబురావు మాస్టారును ఘనంగా పూలమాలలతోను, శాలువాతోను సత్కరించారు. సమాజానికి అవసరమైన మేధావులను తీర్చిదిద్దేవారు ఉపాధ్యాయులని ఎమ్మెల్యే కొనియాడారు.



మామిడాడలో బాబురావు మాస్టర్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

పంచాయతీ నిర్మాణాలకు సహకారం

అన్నవరం: అన్నవరం పుణ్యక్షేత్రంలో గ్రామ పంచాయతీ శాఖ నిర్మిస్తున్న వివిధ నిర్మాణాలకు తగిన సహకారం అందిస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజ తెలిపారు. శనివారం సత్యదేవుని ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామివారి దర్శనం అనంతరం కొండదిగువన గ్రామపంచాయతీ నిధులతో నిర్మిస్తున్న ఆటోనగర్, షాపింగ్ కాంప్లెక్స్, పాత బస్టాండ్ వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని మొదటి, రెండు అంతస్తుల్లో నిర్మాణాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎస్.కుమార్ రాజా ఆయనకు నిర్మాణాల పురోగతిని వివరించారు. ప్రతిఏటా ధనుర్మాసంలో నెల రోజుల పాటు సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారిని పల్లకీలో గ్రామంలో ఊరేగిస్తారని తెలిపారు. గ్రామంలోని పెదరావిచెట్టు సెంటర్ వద్ద గల మాంసం, చేపల దుకాణాల వలన ఊరేగింపు ఈ ప్రాంతం మీదుగా జరగడం లేదన్నారు. ఆ దుకాణాలను మరో చోటకు మార్చాలని దేవస్థానం అధికారులు తెలపడంతో పంపా బ్రిడ్జి అవతల గల స్థలంలో ఈ షాపులు ఏర్పాటు చేసేందుకు గాను షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామని వివరించారు. అదే విధంగా షాపులను ఆనుకుని ఆటోనగర్ నిర్మిస్తున్నామని వివరించారు.

అన్నవరంలో హిందూ శ్మశానవాటిక లేకపోవడంతో దానిని కూడా నిర్మిస్తున్నామని వివరించారు. పాత బస్టాండ్ వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ మొదటి, రెండో అంతస్తులలో షాపులు నిర్మించి అద్దెకివ్వనున్నట్లు పెర్కొన్నారు.

ఈ నిర్మాణాలకు పంచాయతీ రాజ్ శాఖ తరుపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందచేస్తామని తెలిపారు. అదే విధంగా సత్యదేవుని ఆలయానికి దేశం నలుమూలల నుంచి ప్రతి నిత్యం భక్తులు విచ్చేస్తారని కావున గ్రామంలో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు పంచాయతీకి బ్లీచింగ్, ముగ్గు సరఫరా చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. గ్రామంలోని మెయిన్ రోడ్డులో పారిశుధ్య పనుల కోరకు దేవస్థానం శానిటరీ విభాగం నుంచి సిబ్బందిని పంచాయతీకి పంపించాలని ఆదేశించారు. గ్రామసర్పంచ్ కుమార్ రాజా, గ్రామ కార్యదర్శి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కాంప్లెక్స్ నిర్మాణ వివరాలను కమిషనర్ కృష్ణతేజకు వివరిస్తున్న సర్పంచ్ కుమార్‌రాజా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఏలేశ్వరం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని వైఎస్సార్‌సీపీ నేత, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్ అన్నారు. మండలంలోని తూర్పులక్ష్మీపురంలో శనివారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీటీసీ సభ్యుడు మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగాపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్.వీరబాబు, కోరాడ నాగభూషణం, జనార్దన, తోట వీరరాఘవులు, కర్రి సత్తిబాబు, వీరంరెడ్డి మంగాదేవి, గ్రామస్తులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.